హెచ్ఐవీ సెంటినెల్ సర్వేలెన్స్ ప్లస్‌కు జీజీహెచ్ ఎంపిక

మంచిర్యాల అర్బన్, జనవరి 17 : హెచ్ఐవీ సెంటినెల్ సర్వేలెన్స్ ప్లస్ – 2025 కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ నమూనా సేకరణకు మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎంపికైనట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం అధికారి సుధాకర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి మార్చి 31 వరకు గర్భిణుల నుంచి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంత మందికి హెచ్ఐవీ/సిఫిలిస్/హెపటైటిస్ బీ అండ్ సీ వైరస్ వివరాల సేకరణే దీని ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు వారు పేర్కొన్నారు. 400 శాంపిళ్లు సేకరించడం టార్గెట్‌గా పెట్టుకోన్నట్లు, ఇప్పటి వరకు 28 సేకరించినట్లు లిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిణి డా.గరుడలక్ష్మిని నియమించినట్లు వారు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సాయిచరణ్ ప్రేమ్‌కుమార్ ప్రజ్వల శ్రీ

రెబ్బెన, జనవరి 17 : మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా నారఖేర్‌లో 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే 69వ జాతీయస్థాయి జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గోలేటి గ్రామానికి చెందిన క్రీడాకారులు సాయిచరణ్, ప్రేమ్‌కుమార్, ప్రజ్వల శ్రీ ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎంపికైనవారిని అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, షార్ప్‌స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, చెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరెడ్డి, మెంబర్స్ భాస్కర్, రామకృష్ణారెడ్డి, కుమ్మరి మల్లేశ్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణ్, సాంబయ్య, సదానందం, లింగరెడ్డి, హరిలాల్, మల్లేశ్, సతీశ్, తౌఫీక్, రెడ్డి సతీశ్, శ్రీధర్, చిన్ని అభినందనలు తెలిపారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

వాంకిడి, జనవరి 17 : బుద్ధుడు, అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క దళితుడూ కృషి చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ కలెక్టర్ ప్రభాకర్ గడపలే పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. మార్చి 1 నుంచి 10 వరకు నిర్వహించే పది రోజుల సమావేశానికి సంపూర్ణ సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భారతీయ బౌద్ధ మహాసభ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహల్కార్, ఉపాధ్యక్షుడు దినేశ్ ఉప్రే, పుల్ అంబేద్కర్ బుద్ధ భూమి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ్ ఉప్రే, మండలాధ్యక్షుడు జైరాం ఉప్రే, ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, సమాజ్ అధ్యక్షుడు విలాస్, రాజేంద్రప్రసాద్, నాయకులు రోషన్, సందీప్, బల్వంత్, అరుణ్, ఇంద్రజిత్, ప్రతాప్, నాగశేన్, మహేశ్, రమేశ్, దీపక్, రాజేశ్వర్, దిలాజి, పశాంత్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు విజయవంతం చేయండి

రెబ్బెన, జనవరి 17 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి భీమన్న క్రీడామైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. వేడుకల సందర్భంగా విద్యార్థుల పిరమిడ్, పరేడ్, నృత్యాలు ఆకర్షనీయంగా ఉండేలా, సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, డీజీఎం(సెక్యురిటీ) ఉమాకాంత్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్(ఎస్ఈ) మదీనా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

మాలీ కులస్తుల సంక్షేమానికి కృషి

సన్మానిస్తున్న మండల మాలీ సంఘం నాయకులు

రెబ్బెన, జనవరి 17 : మాలీ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు, వారి సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యాంరావ్, ప్రధాన కార్యదర్శి అదే వసంతరావు పేర్కొన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు షేండే వాసు, ప్రధాన కార్యదర్శి నీకోడే గంగారాం, గ్రూప్ 4 లో ఉద్యోగం సాధించిన వారిని మండల నాయకులు సన్మానించారు. మండలాధ్యక్షుడు మోర్లే తిరుపతి, నాయకులు గంటుమేర, శంకర్, రమేశ్, వడై పోశం, గుర్లే మహేశ్, తిరుపతి, వడై హన్మంతరావు, కాంతారావు, భీంరావ్, నగేశ్, వడై మాధవి, మహేశ్, శంకర్, వడై శివరాం, దేవర వినోద్ ఉన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, జనవరి 17 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 3 గనిపై శుక్రవారం గైర్హాజరు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మురళీ చౌదరితో కలిసి మేనేజర్ వెంకట్రావ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 2024లో 150 మస్టర్లు నిండని మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలని, కుటుంబాలను కాపాడుకోవాలని సూచించారు. గైర్హాజరు వల్ల సంస్థకు ఉత్పత్తి నష్టంతో పాటు, ఇతర సూపర్‌వైజర్లకు ఓటీలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. సేఫ్టీ ఆఫీసర్ మహేందర్, సీనియర్ పీవో శాంతన్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి లేఖలు..

వివిధ కేటగిరీ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి లేఖలు ఏజెంట్, మేనేజర్ అందించారు. 15 మందికి ప్రమోషన్లు అందించామని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిర్యాణి, జనవరి 17 : మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న సీఆర్టీ సాంఘిక శాస్త్రం, అలాగే పీజీ సీఆర్టీ కామర్స్, సివిక్స్, నర్సింగ్ పోస్టులకు గెస్ట్ ఫాకల్టీగా దరఖాస్తులు స్వీకరిస్తునట్లు ప్రత్యేకాధికారి స్వప్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు జిల్లాకు చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. సీఆర్టీకి డిగ్రీ, బీఎడ్‌తో పాటు, టెట్ అర్హత ఉండాలని, పీజీ సీఆర్టీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులతో పీజీతో పాటు, బీఈడీ అర్హత కలిగి ఉండాలని, నర్సింగ్ పోస్టుకు బీఎస్సీ నర్సింగ్ చేసి ఉండాలని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20న సాయంత్రం 4 గంటలలోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాను అగ్రభాగాన నిలుపాలి

నస్పూర్ : మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 17 : అభివృద్ధి, ఐక్యతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అగ్రభాగాన నిలుపాలని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై నిర్మల్ కలెక్టర్ అభిలాష అధ్యక్షతన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి కార్యాచరణ ప్రణాళిక–సమీక్షా సమావేశం నిర్వహించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్, రాజర్షి షా, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ–ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, ఎమ్మెల్సీ దండే విఠల్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, వెడ్మ బొజ్జు, నిర్మల్ మున్సిపల్ చైర్ పర్సన్ జీ ఈశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం చేపడుతున్న పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అర్హులకు పథకాలు అందేలా అధికారులు పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. రైతు భరోసాలో భాగంగా 55 మంది విస్తరణ అధికారులతో 16 నుంచి సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులందరికీ రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లపై 16వ తేదీ నుంచి సర్వే బృందాలు, మండల అధికారులు, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో రైతు భరోసాకు భారతి పోర్టల్ ప్రకారం 1,31,857 మంది రైతులకు 4,43,602 ఎకరాల భూములు ఉన్నాయని వెల్లడించారు. సాగుకు యోగ్యంకాని భూములు, ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ కింద సేకరించిన భూములు, నాలాలు, వెంచర్లు, లే అవుట్లు వంటి భూములను గుర్తించి, జాబితా నుంచి తొలగించేందుకు సర్వే సిబ్బంది పరిశీలిస్తున్నారని తెలిపారు. నూతన రేషన్ కార్డులకు జిల్లాలో 14,407 దరఖాస్తులు వచ్చాయని, సర్వే బృందం సభ్యులు దరఖాస్తుదారులకు సంబంధించి ఇంటింటికీ వెళ్లి జాబితా రూపొందిస్తున్నారని వివరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులుపైన పని చేసిన 56,499 కుటుంబాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో అర్హులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అందిన దరఖాస్తుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసి, 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభల ద్వారా అర్హుల జాబితా రూపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సర్వే వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు.

మాసోత్సవాలు జయప్రదం చేయాలి

మంచిర్యాల అర్బన్ : కరపత్రాలను విడుదల చేస్తున్న డీసీపీ, ఆర్టీవో అధికారులు

మంచిర్యాల అర్బన్, జనవరి 17 : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జయప్రదం చేయాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో శుక్రవారం రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి సంతోష్‌తో కలిసి కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు కిషోర్ చంద్రా రెడ్డి, రంజిత్, సూర్యతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి, జనవరి 17 : మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ సమీపంలో ఎంవీఐ జీ మోహన్ ఏఎంవీఐలు సీహెచ్ రాజమల్లు, చంద్రశేఖర్‌తో కలిసి వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుళ్లు రవి, వహీద్, వాహనదారులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, జనవరి 17 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ 3 గనిపై ఉద్యోగులు, కార్మికులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, గని ఏజెంట్ వెంకటేశ్వర్లు, మేనేజర్ వెంకట్రావ్ అవగాహన కల్పించారు. ఉద్యోగులతో ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. గని సేఫ్టీ ఆఫీసర్ మహేందర్, సీనియర్ పీవో శాంతన్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మురళీచౌదరి పాల్గొన్నారు.

దండేపల్లి, జనవరి 17 : మండలంలోని మేదరిపేటలో డ్రైవర్లకు ఎంవీఐ కిషోర్ చంద్రారెడ్డి అవగాహన కల్పించారు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు సకాలంలో చెల్లించాలి

కాగజ్‌నగర్, జనవరి 17 : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024–25 సంవత్సరంలో డిగ్రీ 2వ, 3వ సంవత్సరంలో ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులు 25 తేదీలోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి, కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94943 14314, 91601 44943, 98663 98678 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

జన్నారం : పొనకల్‌లో సర్వే పరిశీలిస్తున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్

జన్నారం, జనవరి 17 : రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ లబ్ధిదారుల ఎంపిక సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ అధికారులను ఆదేశించారు. పొనకల్ పంచాయతీ పరిధి శ్రీలంకకాలనీలో అధికారులు చేపట్టిన సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ గంగారాజ, విస్తరణ అధికారి మల్యాల శ్రీసధ్య, సర్వేయర్ రామకృష్ణ ఉన్నారు.

కాసిపేట, జనవరి 17 : కాసిపేట మండలంలో రైతు భరోసా లబ్ధిదారులకు సంబంధించిన భూములను అధికారులు సర్వే చేశారు. రైతు భరోసా కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండాపూర్‌లో సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, కార్యదర్శి రజిత పాల్గొన్నారు.

హాజీపూర్, జనవరి 17 : హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్ పాండే సబ్బపెల్లి గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన చేసి, వ్యవసాయ భూములను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కృష్ణ, ఆర్ఐ ఏసయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసన్న తదితరులున్నారు.

తాండూర్, జనవరి 17 : తాండూర్ మండలంలోని మాదారం, రేచిని, పలు గ్రామాల్లో చేపడుతున్న సర్వే ప్రక్రియను ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎంపీవో అనిల్‌కుమార్ పరిశీలించారు. గిర్దావార్ ఎజాజుద్దీన్, కార్యదర్శులు సౌందర్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

సిర్పూర్(యూ), జనవరి 17 : సిర్పూర్(యూ) మండలం రాఘుపూర్, ధనోరా గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను తహసీల్దార్ ఉదయకుమార్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సర్వే ఉండాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెంచికల్‌పేట్, జనవరి 17 : మండలంలోని ఎర్రగుంట గ్రామంలో సర్వేను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఆల్బర్ట్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి నరేశ్, సామాజిక కార్యకర్త ప్రకాశ్ పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ నిరసన

నిరసన తెలుపుతున్న నాయకులు

బెల్లంపల్లి, జనవరి17 : సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఇంజినీరింగ్ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ బ్రాంచ్ చైర్మన్ ఎస్ నాగరాజు, కార్యదర్శి జీ సాంబశివుడు మాట్లాడుతూ.. యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు తెలిపారు. ట్రాక్ మెయింటెయినర్స్ విభాగంలో ఖాళీలను వెంటనే భర్తీ చేసి, అదనపు పోస్టులను సృష్టించాలని డిమాండ్ చేశారు. ఉమెన్ ట్రాక్ మెయింటెయినర్లను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. గ్రూప్ డీ రిక్రూట్‌మెంట్ అంతా ట్రాక్ మెయింటెయినర్స్ కేటగిరీ మాత్రమే అయి ఉండాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ మహా కూటమి మండల కమిటీ

కౌటాల, జనవరి 17 : మాదిగల మహా కూటమి కౌటాల మండల కమిటీని శుక్రవారం ఆదివాసీ మన్నెవార్ల సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర సలహాదారు ఇరిగిరాల భాస్కర్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా సిద్ధల బాపు, అధ్యక్షుడిగా ఇప్ప తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నక్క మహేశ్, ప్రధాన కార్యదర్శిగా అయిల్ల తిరుపతి, కోశాధికారిగా లేగంట స్వామి, ప్రచార కార్యదర్శిగా ముల్కల్ల తిరుపతిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రేగుంట రాజలింగు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి కోగిల శ్రీమాన్, కాగజ్‌నగర్ పట్టణాధ్యక్షుడు నరేశ్, తాలూకా ఇన్‌చార్జిలు చిలుముల పరుషోత్తం, గొడిసెల రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా గోపాల్‌రావు

భీమారం, జనవరి 17 : భీమారం ఎంఈవోగా ఎంవీఎం గోపాల్ రావు (గ్రేడ్–1)గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంఈవో కే సురేశ్ రిటైర్డ్ అవగా, చెన్నూర్ పట్టణంలోని జడ్పీ సెకండరీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గోపాల్‌రావు ఇక్కడ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

చెన్నూర్ రూరల్, జనవరి 17 : చెన్నూర్ పట్టణంలోని బలిజవాడలో మూడురోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ శుక్రవారంతో ముగిసింది. మొత్తం 10 జట్లు పాల్గొనగా, ప్రథమ స్థానంలో నరహరి కృష్ణ జట్టు, ద్వితీయ స్థానంలో ఖాజీపూర జట్లు నిలిచాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, కౌన్సిలర్ అనిల్, స్థానిక నాయకులు బహుమతులు అందజేశారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

రెబ్బెన, జనవరి 17 : బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం కే రాజమల్లు తెలిపారు. ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. నూతనంగా వచ్చిన ఎడుగురు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్(ఎస్ఈ) మదీన బాషా, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ సాయివెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏఎస్ఐలకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

కోటపల్లి, జనవరి 17 : కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐలు కాంతారావ్, లక్ష్మణ్‌కు ఎస్ ఐలుగా ఉద్యోగోన్నతి లభించింది. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌ను కలసి, పతకాలను స్వీకరించారు. అనంతరం డీసీపీ, జైపూర్ ఏసీపీ, చెన్నూర్ రూరల్ సీఐ, ఎస్ఐలను కలిసి స్వీట్లను అందచేశారు.

ఆరోపణలు మానుకోవాలి

మందమర్రి, జనవరి 17 : గుర్తింపు పేరు చెప్పి తమ యూనియన్ నాయకులు ఉపరితలంలో విధులు నిర్వహిస్తున్నారని ఐఎన్టీయూసీ నాయకులు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ ప్రాజెక్టు అధికారి మల్లయ్యను శుక్రవారం నాయకులతో మర్యాద పూర్వకంగా కలసి, కార్మిక సమస్యలపై చర్చించారు. అనంతరం కార్మికులను కలసి సమస్యలు తెలుసుకున్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, అర్నకొండ ఆంజనేయులు, సీవీ రమణ, తిరుపతి, గోపతి సత్యనారాయణ, కుమార్, రాజేశ్, ఆంటోని, దినేశ్, రమేశ్, పోశం తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

కన్నెపల్లి, జనవరి 17 : కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా భీమిని మండలం తిమ్మాపూర్ గ్రామంలోని యువకులకు ఎస్ఐ విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్లు అందజేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

టీం పంచముఖి సేవలు అభినందనీయం

మందమర్రి, జనవరి 17 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి పాలచెట్టు ఏరియాలో గల శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటైన టీం పంచముఖి స్వచ్ఛంద స్వంస్థ సేవలు అభినందనీయమని తహసీల్దార్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధి మూడోజోన్ కాలనీకి చెందిన జంగంపల్లి పద్మ కీళ్ల వాతంతో బాధపడుతున్నది. సంస్థ సభ్యులు బాధితురాలి ఇంటికి వెళ్లి, వారి కుటుంబ పరిస్థితిని గమనించి సోషల్ మీడియా వేదికగా విరాళాలను సేకరించారు. రూ.1,01,200ను శుక్రవారం అందజేశారు. సంస్థ సభ్యులు సిద్ధం అంజయ్య, అనిల్ యాదవ్, శశిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 17 : ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని కేటగిరీల్లో కేవలం 11 శాతం మంది మాత్రమే బీసీలు ఉద్యోగాల్లో ఉన్నారని, మండల్ కమిషన్ సిఫారసు మేరకు 27 శాతం ఉద్యోగాలను బీసీలకు ఇవ్వాల్సి ఉన్నా, ఇప్పటికీ నెరవేరలేదని నాయకులు అవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు పెడితేనే బీసీలకు ప్రాతినిధ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం జనాభా దామాషా ప్రకారం ఉద్యోగాల భర్తీ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్, మాడిశెట్టి వెంకటేశ్, బోరే రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

రెబ్బెన, జనవరి 17 : ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించి, ఉద్యోగానికి వన్నె తెవాలని రెబ్బెన సీఐ బుద్ధే స్వామి సూచించారు. రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన లక్ష్మణ్‌ను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో శాలువా కప్పి సన్మానించారు. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

మహిళ అరెస్ట్.. రిమాండ్

రెబ్బెన, జనవరి 17 : తక్కలపల్లి గ్రామానికి చెందిన పుప్పాల సతీశ్ (30)ను పురుగుల మందు తాగించి చంపిన ఘటనలో భార్య పుప్పాల రజితను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బుద్ధే స్వామి, ఎస్ఐ